# గెలుపెవరిదో?



కరీంనగర్‌లోని కార్ఖానగడ్డ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

- నేడు వీడనున్న ఉత్కంఠ
- ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు
- మధ్యాహ్నం వరకు వెలువడనున్న ఫలితాలు

కరీంనగర్, డిసెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపెవరిదనే ఉత్కంఠ నేటితో వీడనుంది. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఇక్కడే జరుగుతోంది. పోలీసులు పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. ఈసారి నాలుగు నియోజకవర్గాల్లో 73 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వీరిలో గెలుపు ఎవరిని వరిస్తుందోననే ఉత్కంఠ నేటితో వీడనుంది.

### వీడనున్న ఉత్కంఠ

తీవ్ర ఉత్కంఠను రేపుతున్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆదివారం తేలనున్నాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో హోరా హోరీగా ఎన్నికల జరిగాయి. కరీంనగర్‌లో 27, చొప్పదండిలో 14, మానకొండూర్ 10, హుజూరాబాద్‌లో మరో 22 మంది పోటీలో ఉన్నారు. ప్రధానంగా అన్ని నియోజకవర్గాల్లో అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల మధ్యనే పోటీ జరిగింది. ఈ పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరికి వారే గెలుపు ధీమాతో కనిపిస్తున్నారు. నెల రోజుల పాటు జరిగిన ఎన్నికల ప్రచారంలో అన్ని పార్టీలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. గత నెల 30న పోలింగ్ జరిగింది.

### లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి ఏర్పాట్లను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రతి కౌంటింగ్ హాల్లో 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వారీగా వచ్చే రౌండ్స్‌ను విభజించి ఒక్కో నియోజవర్గానికి వచ్చే రౌండ్లను నిర్ధారించారు. ఈ లెక్కన కరీంనగర్‌లో 390 పోలింగ్ కేంద్రాలు ఉండగా 28 రౌండ్లలో, మానకొండూర్‌లో 327 పోలింగ్ కేంద్రాలు ఉండగా 23 రౌండ్లు, చొప్పదండిలో 316 పోలింగ్ కేంద్రాలు ఉండగా 24 రౌండ్లు, హుజూరాబాద్‌లో 305 పోలింగ్ కేంద్రాలు ఉండగా 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తున్నారు. అయితే, లెక్కింపు సిబ్బంది మాత్రం ఉదయం 6 గంటలకే కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని ఎన్నికల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను, ఆ తర్వాత ఈవీఎంల ఓట్లను లెక్కిస్తారు. కాగా, ఫలితాల సరళి మధ్యాహ్నం వరకు తేలే అవకాశాలు ఉన్నాయి.

### లెక్కింపు పూర్తయ్యే వరకు అక్కడే..

ఓట్ల లెక్కింపు విధులకు హాజరయ్యే సిబ్బంది అవి పూర్తయ్యే వరకు హాలు వదిలి బయటకు వెళ్ల రాదని కౌంటింగ్ అబ్జర్వర్ సీఆర్ ప్రసన్న కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఓట్ల లెక్కింపులో పాల్గొనే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రో అబ్జర్వర్లకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఆయన పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. మైక్రో అబ్జర్వర్లు కౌంటింగ్ కేంద్రానికి ఉదయం 6 గంటలకే హాజరు కావాలని అన్నారు. కేంద్రంలోకి ఎలాంటి సెల్ ఫోన్ల వంటి పరికరాలు తీసుకెళ్లవద్దని చెప్పారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాలని తర్వాత ఈవీఎంలలోని ఓట్లను లెక్కించాలని ఆదేశించారు.

### ట్రాఫిక్ ఆంక్షలు

అసెంబ్లీ ఓట్ల లెక్కింపు సందర్భంగా స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి. కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వెళ్లే వాహనాలు గీతాభవన్ మీదుగా రాంనగర్, పద్మనగర్, చింతకుంట బై పాస్ మీదుగా లేదా శాతవాహన యూనివర్సిటీ రోడ్ మీదుగా రేకుర్తి నుంచి వెళ్లాల్సి ఉంటుంది. జగిత్యాల నుంచి వచ్చే వాహనాలు కూడా కొత్తపల్లి మీదుగా బైపాస్ రోడ్ మీదుగా గానీ, రేకుర్తి శాతవాహన యూనివర్సిటీ రోడ్డు మీదుగా చింతకుంట, పద్మనగర్, రాంనగర్ మీదుగా గానీ కరీంనగర్ చేరుకోవాల్సి ఉంటుంది. ద్విచక్ర వాహనాలను కోర్టు మూల మీదుగా శివ థియేటర్ వైపు దారి మళ్లిస్తున్నారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రం విడిచి వెళ్లవద్దు




మాట్లాడుతున్న ఓట్ల లెక్కింపు పరిశీలకుడు సీఆర్ ప్రసన్నకుమార్

- ఓట్ల లెక్కింపు పరిశీలకుడు సీఆర్ ప్రసన్నకుమార్

కలెక్టరేట్, డిసెంబర్ 2: ఓట్ల లెక్కింపు ముగిసే వరకు సిబ్బంది కేంద్రాన్ని విడిచి వెళ్లవద్దని ఓట్ల లెక్కింపు పరిశీలకుడు సీఆర్ ప్రసన్న కుమార్ సూచించారు. నగరంలోని కలెక్టరేట్ ఆడిటోరియంలో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో పాల్గొనే అకౌంటింగ్ సూపర్‌వైజర్లు, మైక్రోఅబ్జర్వర్లు, మాస్టర్ ట్రైనర్లకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించగా, ఓట్ల లెక్కింపు పరిశీలకుడు సీఆర్ ప్రసన్న, ఎస్‌జే చౌడ, మనీష్‌కుమార్‌లోహన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓట్ల లెక్కింపు పరిశీలకుడు సీఆర్ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, లెక్కింపు హాల్‌లో మైక్రో అబ్జర్వర్లు ఉదయం 6 గంటలకు హాజరుకావాలని ఆదేశించారు. కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు తీసుకెళ్లకూడదన్నారు. పోలింగ్‌ను ప్రశాంతంగా విజయవంతం చేసిన మాదిరి, లెక్కింపును కూడా చేయాలని పిలుపునిచ్చారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను మొదట లెక్కించాలని, అనంతరం ఈవీఎంలలోని ఓట్లు లెక్కించాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని, ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే రిటర్నింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఎస్సారార్ కళాశాలలో లెక్కింపు ముగిసి గెలిచిన అభ్యర్థులను ప్రకటించే వరకు కౌంటింగ్ కేంద్రాన్ని వదిలి వెళ్లకూడదని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిప్యూటీ కలెక్టర్ సదానందం, మార్కెటింగ్ అధికారి పద్మావతి, ఎల్‌డీఎం ఆంజనేయులు, డీఈవో జనార్దన్‌రావు పాల్గొన్నారు.

## నోట్స్ ఆవిష్కరణ

హౌసింగ్‌బోర్డుకాలనీ, డిసెంబర్ 2: నగరంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ రూపొందించిన డిగ్రీ మూడో సెమిస్టర్ నోట్స్‌ను ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనంతం సీతారాంపూర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించినట్లు సాగర్ తెలిపారు. ధనపురి సాగర్ మాట్లాడుతూ, తమ సంస్థ తరపున నోట్స్ ఉచితంగా అందజేయడానికి ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. దూర ప్రాంత విద్యార్థులు వాట్సాప్ నంబర్ 88855 49467లో సంప్రదిస్తే పీడీఎఫ్ రూపంలో పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుండా శ్రీనివాస్, ఆంగ్ల అధ్యాపకులు గుమ్మడి కుమార స్వామి, కుంటాల శ్రీనివాస్, రమణ, ముని గోపాల్ పాల్గొన్నారు.



నోట్స్‌ను ఆవిష్కరిస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ అనంతం, తదితరులు

## తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ మృతి

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 2: కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి మాజీ సర్పంచ్ కాశెట్టి రంగమ్మ (86) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. రంగమ్మ 2000–2004 వరకు సర్పంచ్‌గా పని చేశారు. ఆమె మృతికి ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంతాపం తెలిపారు.



రంగమ్మ (ఫైల్)



ఉద్యోగుల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్న ఎస్ఈ గంగాధర్

# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్

ముకరంపుర, డిసెంబర్ 2: ఉద్యోగుల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఎన్పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో శనివారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. సర్కిల్ కార్యాలయానికి మొత్తం ఆరు అప్లికేషన్లు రాగా ఐదింటిని తక్షణమే పరిష్కరించామని, ఒక అప్లికేషన్ వరంగల్ కార్యాలయానికి సంబంధించిందని పేర్కొన్నారు. ప్రతినెల మొదటి శనివారం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామని, ఎస్ఈ తో పాటు డీఈలు ఉద్యోగుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి, సమస్యను వెంటనే పరిష్కరిస్తారని పేర్కొన్నారు. కరీంనగర్ టౌన్ డివిజన్ కార్యాలయానికి 12 దరఖాస్తులు రాగా రెండింటిని తక్షణమే పరిష్కరించారు. కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలో నాలుగు, హుజూరాబాద్ డివిజన్ పరిధిలో మూడు దరఖాస్తులు రాగా మూడు రోజుల్లో పరిష్కరిస్తామని డీఈలు తిరుపతి, లక్ష్మీ రెడ్డి తెలిపారు. డీఈ లు రాజం, విజేందర్ రెడ్డి, ఎస్ఏవో రాజేశం, రాజేంద్రప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు

రాంనగర్, డిసెంబర్ 2: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఆదివారం కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు ఈ నెల 3న ఉదయం 6 గంటల నుంచి 4వ తేదీ ఉదయం 6 గంటల వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఈ ఉత్తర్వుల ప్రకారం ఐదుగురికి మించి గుమిగూడరాదని పేర్కొన్నారు. ఏదైనా సమావేశం ఏర్పాటు చేస్తే సంబంధిత అధికారి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. పై ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సీపీ అభిషేక్ మహంతి



క్యాండిల్ వెలిగించి ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బిషప్, క్రైస్తవులు

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు

చొప్పదండి, డిసెంబర్ 2: మండల కేంద్రంలోని హోలీషాలోమ్ చర్చిలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. బిషప్ గుండేటి శాంతికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో భాగంగా చిన్నపిల్లలు నృత్యాలు, క్యాండిల్ వెలిగించారు. ఈ సందర్భంగా శాంతికుమార్ మాట్లాడుతూ, లోకరక్షకుడైన ఏసుక్రీస్తు జన్మదినం ఈనెల 25న పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నారని అందులో భాగంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు.

## నేడు లక్ష దీపోత్సవం

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 2: కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేద పండితుడు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. అమ్మవారికి కార్తీక మాస ప్రయోక్త చతుషష్టి పూజలు, దీపా సంకల్పం, దీపారాధన, మహా మంగళ హారతి అనంతరం దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. లక్ష దీపోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రేపు నగరంలో మంచినీటి సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, డిసెంబర్ 2: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో సోమవారం మంచినీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మానేర్ డ్యామ్ నుంచి ఫిల్టర్ బెడ్‌లోకి నీటిని సరఫరా చేసే పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నందున నీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు ఈ విషయాన్ని నగర ప్రజలు గమనించి నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.